క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఎంఈవోను సత్కరిస్తున్న మండల ఉపాధ్యాయ సంఘ నాయకులు

జియ్యమ్మవలస: ఎంఈవో1గా ధనుకొండ గౌరునాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆయనను మండల కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని, అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నందెన్న అనుపోత్సవం

సీతానగరం: మండలంలోని గౌరీపౌర్ణమి ఉత్సవాలను పురస్కరించుకుని మండపాలపై కొలువుదీరిన నందెన్న అనుపోత్సవ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మండల కేంద్రంలో శాలివాహన కులస్తుల ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నందెన్న ఉత్సవాలు జరిగాయి. సీతానగరం మార్కెట్ మీదుగా పురవీధుల్లో పార్వతీపరమేశ్వరులు, నందెన్న ప్రతిమలతో తిరువీధి చేశారు. అనంతరం సువర్ణముఖీనదిలో నిమజ్జనం చేశారు.

యువత నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురంటౌన్: యువత తమకు ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పట్టణంలోని ఎస్వీడీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి 578 మంది అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరైనట్లు చెప్పారు. అందులో 85 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికై నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ కాలేజీలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలి

బలిజిపేట: ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ-1 సామల సింహాచలం సూచించారు. మండలంలోని బర్లి ప్రాథమికోన్నత, వెంగాపురం ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్ బుక్స్, వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకునేందుకు అవసరమైన సూచనలు చేశారు. బోర్డుపై అక్షరాలు రాసి వాటిని విద్యార్థులతో చదివించారు. అకడమిక్ పుస్తకాల ప్రకారం విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించేందుకు కృషి చేయాలని, మధ్యాహ్న భోజనంలో మంచి పోషకాహారాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

పార్వతీపురం టౌన్: మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎం.కృష్ణారావు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యల సత్వర పరిష్కారానికి వచ్చే నెల మొదటివారంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా సైకిక్ బోర్డు సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు వారి సూచనలు, సలహాలను ఈ నెల 31లోగా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, విజయనగరం వారికి అందజేయాలని కోరారు. లిఖితపూర్వకంగా గానీ, 8688817946 నంబరుకు వాట్సాప్, జెడ్ఎస్‌డబ్ల్యూఓవీజెడ్ ఎం జీ మెయిల్ చేయవచ్చని తెలిపారు.

బదిలీ ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్

పార్వతీపురం: పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సచివాలయ కార్యదర్శులకు బదిలీ ఉత్తర్వులను జారీచేసినప్పటికీ ఇంతవరకు రిలీవింగ్, జాయింగ్ ఆర్డర్స్ ఇవ్వని ఎంపీడీఓలపై తక్షణం చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రజా సమాఖ్య సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేర కు సోమవారం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గిరిజన సంఘ నాయకులు మాట్లాడుతూ బదిలీ ఉత్తర్వులు జిల్లా కలెక్టర్ ఇచ్చినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు వాటిని అమలు చేయడం లేదన్నారు. దీంతో సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు నెలవారీ జీతభత్యాలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఆరోగ్య ఫలదాయిని సీతాఫలం..

- పేదల ఆపిల్‌గా గుర్తింపు
- మార్కెట్‌లో విరివిగా లభ్యం



ఏజెన్సీ సీతంపేట పరిసరాలలో సహజసిద్ధంగా పండుతున్న సీతాఫలం

పాలకొండ రూరల్: ప్రకృతి నుంచి సహజ సిద్ధంగా లభించే అద్భుతమైన పండ్లలో సీతాఫలం ఒకటి. పేదల ఆపిల్‌గా పేరొందిన ఈ ఫలం నోరూరించే రుచితో పాటు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఈ పండును ఇష్ట పడతారు. ఈ పండు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. రక్తపోటును అదుపులో ఉంచుతుంది. కొవ్వు శాతం తగ్గిస్తుంది. కంటి చూపును మెరుగు పరుస్తుంది. ఆరోగ్యానికి అవసరమైన పీచుపదార్థాలు, విటమిన్లు, శరీరాన్ని చురుగ్గా ఉంచేందుకు అవసరమైన మెగ్నీషియం సీతాఫలంలో ఎక్కువగా ఉంటాయి. పొటాషియం, మెగ్నీషియం గుండెకు రక్షణ కవచంలా పనిచేస్తూ, బీపీ, గుండె సంబంధిత వ్యాధులను అదుపులో ఉంచుతాయి. అధిక బరువుతో బాధపడుతున్న వారికి ఇది ప్రయోజనకరం. అనవసరపు కొవ్వును తగ్గించి, జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఏజెన్సీలో...

ఏజెన్సీ కలబోసి ఉన్న పాలకొండ నియోజకవర్గంలో అక్టోబర్ నెలలో మొదలుకుని డిసెంబర్ వరకు సీతాఫలాలు విరివిగా లభిస్తాయి. ఒక్కో ఫలం సైజును బట్టి విక్రయిస్తున్నారు. డిమాండ్‌కు అణుగుణంగా పండు ధర ఉంటుంది. సీతంపేట సంతతో పాటు పాలకొండ ప్రధాన మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వీటి అమ్మకాలు అధికంగా జరుగుతున్నాయి. సీజన్‌లో వారపుసంతకు గిరిజనులు భారీగా పండ్లను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. పండు నాణ్యత, సైజును బట్టి బుట్ట రూ.3 వందల నుంచి 5 వందల రూపాయల వరకు పలుకుతుంది. ఏటా ఈ పంటల సీజన్‌లో ఇతర జిల్లాలకు చెందిన వర్తకులు సీతంపేట సంతలకు వచ్చి పండ్లను కొనుగోలు చేసి తమ ప్రాంతాలకు తీసుకెళ్లి, అక్కడ వ్యాపారం చేస్తుంటారు. సహజ సిద్ధమైన పసుపు పచ్చ వర్ణంతోపాటు ఎరుపు రంగు సీతాఫలాలకు మంచి గిరాకి లభిస్తుంది.



అమ్మకాలకు సిద్ధం చేసిన సీతాఫలాలు

అనేక ఔషధ గుణాలు..

- మెదడు, నాడీ వ్యవస్థ చురుగ్గా పనిచేయడానికి ఈ ఫలం ఉపకరిస్తుంది.
- క్షయవ్యాధి నివారణకు సీతాఫలాన్ని సమర్థవంతమైన ఆహార వైద్యంగా ఉపయోగిస్తారు.
- ఇందులో ఉన్న గుజ్జును పాలల్లో కలిపి తాగితే శరీరంలోని వేడి, అతి దాహం తగ్గుతుంది.
- బలహీనంగా ఉన్న పిల్లలు, బాలింతలకు సీతాఫలం గుజ్జును తేనెతో కలిపి తాగిస్తే అధిక శక్తి చేకూరుతుంది.
- తలలో చుండ్రు ఉన్న వారు ఎండిన సీతాఫలం గింజలను మెత్తగా పొడిచేసి, రోజూ షాంపులా వాడితే చుండ్రు త్వరగా తగ్గిపోతుంది.

బహుళ ప్రయోజనకారిని..



సీతాఫలం ఆకులు, గింజలు, పచ్చి కాయలు, పండ్లు క్రిమి సంహారక గుణం కలిగి ఉంటాయి. ఎటువంటి క్రిమిసంహారక మందులు వాడకుండా కూడా ఈ పంట సహజసిద్ధంగా పండుతుంది. అనేక దీర్ఘకాలిక రోగాలను అరికడుతుంది. దీని ఆకుల్లో పీచుపదార్థం అధికం. శరీరంలో చక్కర శాతం క్రమబద్ధీకరిస్తుంది. యాంటీ ఆక్సైడ్స్ కలిగి ఉంటుంది. అకాల వృద్ధాప్యం నిరోధిస్తుంది. మెగ్నీషియం, పోటాషియం కలిగి ఉండడం వల్ల గుండెకు మేలు. ఈ ఆకు రసం చర్మ సంబంధిత, గాయాల కారణంగా ఏర్పడ్డ మచ్చలను నివారిస్తుంది.

– జి.రవీంద్రకుమార్, డాక్టర్, ఏరియా ఆస్పత్రి, పాలకొండ

వైద్య తనిఖీలు తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

గుమ్మలక్ష్మీపురం: గర్భిణులు తప్పనిసరిగా ప్రతి నెలా వైద్య తనిఖీలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో కేవీఎస్ పద్మావతి సూచించారు. మండల కేంద్రంలోని వైటీసీలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతిగృహాన్ని ఆమె సోమవారం సందర్శించారు. గర్భిణులకు సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వసతిగృహంలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అంతకుముందు వసతిగృహం రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవమా..?

- ఏకలవ్య పాఠశాలలో గృహప్రవేశ పూజలు
- మూడు రోజుల్లో తరగతులు నిర్వహిస్తామన్న సిబ్బంది



ఏకలవ్య పాఠశాల భవనంలో చేపట్టిన గృహ ప్రవేశ పూజ

భామిని: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) భవనాలు పూర్తికాకపోయినా సోమవారం ప్రారంభోత్సవ పూజలు నిర్వహించడంపై పలువురు అవాక్కయ్యారు. స్కూల్ బోధనా సిబ్బంది రహస్యంగా వచ్చి పూజలు నిర్వహించి, మరో మూడు రోజుల్లో తరగతులు ప్రారంభిస్తామని చెప్పడం విశేషం. ఈ ఏడాది సెప్టెంబర్ 10న సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి యశ్వంత్‌కుమార్ రెడ్డి పది రోజుల్లో భామిని ఏకలవ్య భవనాలు ప్రారంభించి తరగతులు నిర్వహిస్తామని ప్రకటించారు. అలాగే పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పడాల భూదేవి వేర్వేరుగా అసంపూర్తి భవనాలను సందర్శించి, విషయాన్ని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పనులు జోరందుకోలేదు. ఇదిలాం ఉంటే పాఠశాలలోని విద్యార్థినులకు కొత్తూరు అద్దె భవనంలో.. విద్యార్థులకు సీతంపేట మండలం మల్లి గురుకుల పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు.

– నత్తనడకన నిర్మాణాలు..

ఈఎంఆర్ఎస్ భవనాలను 12 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.12 కోట్ల వ్యయంతో ఏడేళ్ల కిందట నిర్మాణ పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి నత్తనడకన జరుగుతున్న నిర్మాణాలపై పలు మార్లు కలెక్టర్లు, ఐటీడీఏ పీఓలు సందర్శించి హెచ్చరికలు జారీ చేసినా పనుల్లో ప్రగతి కనిపించలేదు. ప్రస్తుతానికి పాఠశాల భవనం మాత్రమే పూర్తి కావొచ్చినా.. మరుగుదొడ్లు, విద్యుత్ పనులు జరుగుతున్నాయి. అలాగే బాలికల డార్మెటరీ, కిచెన్ భవనాలు అసంపూర్తిగా ఇసుక దిబ్బల మధ్య ఎక్కిరిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో గృహప్రవేశ పూజలు చేపట్టడం విస్మయం కలిగిస్తోంది.



అసంపూర్తిగా ఉన్న డార్మిటరీ భవనం

ఏబీ రోడ్డు అధ్వానం..



భామిని మండల కేంద్రంలోని ఏబీ రోడ్డు అధ్వానంగా మారింది. గోతులతో నిండిపోవడంతో వర్షపు నీరు నిల్వ ఉండి ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశామని కూటమి నాయకులు ప్రకటనలు చేస్తున్నారు. కాని భామిని రోడ్డు దుస్థితి మాత్రం మారలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - భామిని

అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు పి.బాల సూచించారు. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు ఉత్తరాంధ్రలో తుపాను ప్రభావం ఎక్కువగా ఉండనుందన్నారు. అత్యవసరమైతే తప్ప తుపాను ప్రభావం తగ్గేవరకు సెలవులు మంజూరు చేయడం జరగదన్నారు. నదీ తీర ప్రాంతాలను అప్రమత్తం చేయాలని, వారిని నదులకు వెళ్లనీయకుండా చూడాలన్నారు.

సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం



సింగిడి గ్రామసభలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

భామిని: శాశ్వత భూ హక్కు – శాశ్వత భూ సర్వేలో భాగంగా నిర్వహించిన రీ సర్వేలో చోటుచేసుకున్న తప్పులను రెవెన్యూ సదస్సులతో సరిదిద్దనున్నట్లు తహసీల్దార్ నీలాపు అప్పారావు, మండల సర్వేయర్ రాజేశ్వరరావు తెలిపారు. మండలంలోని సింగిడిలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రీ సర్వే జరిగిన 11 గ్రామాల్లోనూ సదస్సులు నిర్వహించి, రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్ఓ జగ్జీవన్ బాబు, సహాయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

గరుగుబిల్లి: మండలంలోని చినగుడబ రెవెన్యూ పరిధిలోని ఆత్మం మైనింగ్ కంపెనీ పనులకు ఆటంకం కలిగిస్తున్నారన్న ఆ కంపెనీ ప్రతినిధి నాగేశ్వరరావు చేసిన ఫిర్యాదు మేరకు పెదగుడబకు చెందిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రమేష్‌నాయుడు సోమవారం తెలిపారు. రోడ్డు మీదుగా జరిగే ఆ కంపెనీ వాహన రాకపోకలను అడ్డుకుంటున్నట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు విచారణ చేసి, చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు.

నిబంధనలు తప్పనిసరి

పాలకొండ రూరల్: పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా వాహనచోదకులు నిబంధనలు పాటించాలని సీఐ ఎం.చంద్రమౌళి అన్నారు. సోమవారం స్థానిక పాలకొండ – వీరఘట్టం రహదారిలో తన సిబ్బందితో కలసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతివేగం, అధిక లోడు, పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు సరికాదన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపినా, పత్రాలు లేకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

74 వినతుల స్వీకరణ

వీరఘట్టం: మండలంలోని అడారులో సోమవారం నిర్వహించిన భూముల రీ సర్వే పరిష్కార వేదికకు 74 వినతులు వచ్చినట్లు రెవెన్యూ అధికారి టీడీ ప్రసాదరావు తెలిపారు. రీ సర్వేలో చోటుచేసుకున్న తప్పులను సరి చేస్తామన్నారు.

గిరిజనులపై దౌర్జన్యాలను అరికట్టాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

జియ్యమ్మవలస: గిరిజనులపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టాలని ఏపీ గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో తహసీల్దారు పకీరును సోమవారం కలిసి, వినతిపత్రం అందజేశారు. గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని, వారి భూముల ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కూరంగి సీతారాం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొండను ముద్దాడిన నింగి..



మన్యంపై మనసు పారేసుకున్నట్లు మేఘాలు ఇలా చెంతకు చేరాయి. పసుపు పచ్చని కోక చుట్టినట్లు ఉన్న పుడమి తల్లిని చూసి పులకించిన నీలి మేఘాలు లయబద్ధంగా ఊగిసలాడుతూ పంటచేలను తాకేందుకు దిగివచ్చాయి. మండలంలోని గుడివాడ వద్ద సోమవారం సాయంత్రం వేళ చిరుజల్లులు కురవడంతో వాతావరణంలో చల్లదనం అలముకోగా.. మేఘాలు చేతికందినంత దిగువకు వచ్చి కొండను ముద్దాడినట్లు కనిపించింది. - పాలకొండ రూరల్

రాష్ట్ర స్థాయి పోటీలకు కొమరాడ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

కొమరాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కళ్లికోట పవన్‌కుమార్, పండిత్ పవన్‌కుమార్‌లు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వై.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరచడంతో వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ నెల 23వ తేదీన నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని, అక్కడ కూడా బాగా రాణించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పోటీలకు పయనమవుతున్న సదరు విద్యార్థులకు సిబ్బంది ఆల్ ది బెస్ట్ చెప్పారు.

రీ సర్వేపై అవగాహన తప్పనిసరి

- తహసీల్దార్ బాలమురళీకృష్ణ



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ బాలమురళీకృష్ణ

పాలకొండ: భూముల రీసర్వేపై పూర్తి అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

ఇప్పటికే రీసర్వే పూర్తయిన గ్రామల్లో గ్రామ సభలు నిర్వహించి రైతుల నుంచి అభ్యంతరాలు తీసుకోవాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి మార్పులు, చేర్పులు చేపట్టాలన్నారు. వారం రోజుల్లోగా రైతులు తెలియజేసిన అభ్యంతరాలను సరిచేయాలని ఆదేశించారు.

ఆప్యాయంగా అక్కున చేర్చుకుని...



మాజీ ఎమ్మెల్యేను పట్టుకుని బోరున విలపిస్తున్న మృతురాలి తల్లి లక్కాయమ్మ

సీతంపేట: ఇటీవల పాతపట్నం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న గిరిజన విద్యార్థిని లావణ్య తల్లి లక్కమ్మ స్థానిక మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆప్యాయంగా అక్కున చేర్చుకుని ఓదార్చారు. సోమవారం సొంత పనుల నిమిత్తం కొత్తూరు వైపు వెళ్తుండగా మార్గమధ్యలో దోనుబాయి కూడలి వద్ద మృతురాలి తల్లిని, కుటుంబ సభ్యులను చూసి వాహనం ఆపి దిగారు. వెంటనే లక్కమ్మ వచ్చి మాజీ ఎమ్మెల్యే కళావతిని పట్టుకుని బోరున విలపించారు. కళావతితో పాటు అక్కడున్న నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు మృతురాలి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి అభినందనలు



మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఎంపీపీ దీనమయ్య, తదితరులు

జియ్యమ్మవలస: మాజీ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఎస్టీ కులానికి చెందిన వ్యక్తేనని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై కురుపాం నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెకు అభినందనలు తెలుపుతున్నారు. కురుపాం మండలంలోని చినమేరంగి గ్రామంలో ఉన్న ఆమె నివాసానికి ఎంపీపీ దీనమయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు సోమవారం వెళ్లి, పుష్పగుచ్ఛాలు అందజేసి, న్యాయస్థానం తీర్పుపై సంతోషం వ్యక్తం చేశారు. ఆమెది ఎస్టీ కులం కాదని నిమ్మక జయరాజు, నిమ్మక సింహాచలంలు 2019లో కోర్టులో కేసు వేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణలు జరుగుతూ రాగా, ఎట్టకేలకు ఆమెకు అనుకూలంగా కోర్టు తీర్పు వెలువరించడం విశేషం.

నాణ్యమైన విద్య, భోజనం అందివ్వాలి



పాఠశాల సిబ్బందికి సూచనలిస్తున్న న్యాయమూర్తి సౌమ్య జోస్పిన్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందివ్వాలని కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి జె.సౌమ్య జోస్పిన్ ఆదేశించారు. కురుపాం మండలంలోని శివ్వన్నపేట గిరిజన సంక్షేమ బాలుర, బాలకల ఆశ్రమ పాఠశాలలతో పాటు జ్యోతీబాపూలే గురుకల పాఠశాలలను ఆమె సోమవారం సందర్శించి, పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులంతా చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అన్ని సదుపాయాలు వారికి సక్రమంగా అందేలా చూడాలన్నారు. అనంతరం స్టోర్ రూమ్‌లోని నిత్యవసర సరుకుల నిల్వలు, వంట గదులు పరిశీలించారు. వసతిగృహాల పరిసరాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో విద్య నేర్చుకోవాలన్నారు.

అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్, తదితరులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): బడిదేవరకొండపై అక్రమ తవ్వకాలు చేపడుతున్న ఎంఎస్‌పీ గ్రానైట్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ డిమాండ్ చేశారు. కురుపాం మండలంలోని మొండెంఖల్ గ్రామంలో సోమవారం నిర్వహించిన పార్టీ ప్రచారంలో ఆయన కాసేపు విలేకరులతో మాట్లాడారు.

కొండ గ్రానైట్ లైసెన్స్ రద్దు చేయాలని కోరుతూ తమ నాయకులు ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగిందన్నారు. గతంలో జిల్లాలోని ప్రజాసంఘాలన్నీ ఇదే అంశంపై సమైక్యంగా ఉద్యమించాయని తెలిపారు.

● పరామర్శ



పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పలువురు మృతుల కుటుంబాలను సోమవారం పరామర్శించారు. సోమగండిలో గొర్లె పులమావతి, రాజన్నగూడలో సవర సూగన్నలు మృతి చెందడంతో ఆయా కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట ఎంపీపీ బి.ఆదినారాయణ, పార్టీ నాయకులు చంద్రశేఖర్, మహేష్, వెంకి, సురాపాణి, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట